అలా నేను చేసే వృత్తికి పిలకా, పంచా కావాలి. నాకు సాంప్రదాయం కంటే సంసారం గడవటమే ముఖ్యం. నా వృత్తిని నా కొడుక్కి నేర్పితే వాడి చదువుసంధ్యలయినాక ఉద్యోగం గురించి పరుగులు పెట్టవలసిన అవసరం లేదు. ఒకరి అడుగులకు మడుగులొత్తవలసిన అవసరం అంతకన్నా ఉండదు. నా దంటూ నాకు ఒక వృత్తి—చేతిలో పని లేకపోతే రేపు నేను మరొకరిమీద ఆధారపడి ఉండాలి. పౌరోహిత్యం కాకపోతే కుమ్మరం చెయ్యి, కమ్మరం చెయ్యి, నాకు వచ్చింది పౌరోహిత్యం కాబట్టి నేను నా కొడుకులకు నేర్పగలిగిందీ, వాళ్ళ కొడుకులను నేర్చుకోమనేదీ అదే" అంటూ కండువా తీసుకుని భుజంమీద వేసుకున్నారు మార్తాండ శాస్త్రిగారు. బయటకు వచ్చారు.

బయట నిలబడిన చిన్న కొడుకును చూసి "ఒరేయ్ ప్రహ్లాద! వెళ్ళి ఆ గణపతిశాస్త్రితో పొడగట్లపల్లి సంబంధం మానుకున్నామని చెప్పు" అని పెదకాపు ఇంటికి బయలుదేరారు శాస్త్రిగారు.

** ** **

లోపలకు వస్తున్న మార్తాండ శాస్త్రిని సాదరంగా ఆహ్వానించాడు కామరాజు.

హాలులో ఉన్న కుర్చీ చూపించి "కూర్చోండి!" అన్నాడు.

శాస్త్రిగారు కుర్చీలో కూర్చున్నారు.

కామరాజు జేబులోంచి పుగాకు తీసి చుట్ట చుట్టుకోవటంలో మునిగిపోయాడు. లోపలనుండి కామరాజు కూతురు గ్లాసుతో మజ్జిగ తీసుకు వచ్చి ఇచ్చింది.

గ్లాసందుకుని ఆమెను ఆప్యాయంగా చూశారు శాస్త్రిగారు.

"ఎప్పు డొచ్చావమ్మా? ఒక్కత్తివే వచ్చావా? అతను కూడా వచ్చాడా?" అడిగారు.

"నిన్న రాత్రి వచ్చాం శాస్త్రిగారూ! ఆయన ఉదయమే వెళ్ళిపోయారు" అంది ఆమె.

శాస్త్రిగారు మజ్జిగ తాగి గ్లాసు ఆమెకు అందించారు.

ఆమె గ్లాసందుకుంది. "కాత్యాయని ఎలా ఉంది?" అడిగింది.

ఆమె కాత్యాయనితో కలిసి చదువుకుంది. ఇద్దరికీ ఒకళ్ళంటే ఒకళ్ళకి తగని ఇది. రెండు నెలల క్రితమే ఆమెకు పెళ్ళయింది.

"బాగానే ఉందమ్మా!" అన్నారు శాస్త్రిగారు.

"సాయంత్రం ఇంటికి వస్తానులెండి" అంటూ లోపలకు వెళ్ళిపోయింది ఆమె.

శాస్త్రిగారు తుండుతో పెదాలు తుడుచుకుని కామరాజు వైపు చూశారు.

కామరాజు చుట్ట వెలిగించాడు. శాస్త్రిగారిని చూశాడు.

"ఎందుకో కబురు పెట్టారు?" అన్నారు శాస్త్రిగారు.

"అవును. రెండు పనులున్నాయి."

"సెలవివ్వండి."

"మీ అమ్మాయి పెళ్ళి సంబంధం ఎంతవరకూ వచ్చింది?"

శాస్త్రిగారు రెండు క్షణాలు తటపటాయించారు. "ఇంట్లో చిన్న అభిప్రాయభేదం వచ్చింది. పాంటూ, షర్టూ వేసుకునే కుర్రాడు కావాలట" అన్నాడు.

"మంచిమాట చెప్పారు. అవును శాస్త్రిగారూ! మీరు మారాలి. కాత్యాయని విషయంలో మాత్రం కాదనకండి. ఆ పిల్ల మనస్తత్త్వం నాకు బాగా తెలుసు" అన్నాడు కామరాజు.

"నేను మారాల్సింది ఏమీ లేదు రాజుగారు. మారిపోయే ఉన్నాను. మీరంతా అంతగా చెబుతుంటే కాదంటానా!" అన్నారు శాస్త్రి.

"మరయితే మీ ఎరుకలో ఏమయినా సంబంధం ఉందా?"

"లేదు. గణపతి శాస్త్రితో చెబుతాను."

"ఎవరు, ఆ గణపతి పూజ కూడా సరిగా చేయించలేని గణపతి శాస్త్రితోనా? అలాంటి వాడివల్లే మీ బ్రాహ్మల పరువు పోతోంది. నిప్పులాంటి మీ వంశంలో తులసివనంలో గంజాయి మొక్కలా దాపరించాడు అతడు. మీరేమో బంధుత్వం చంపుకోలేక అతణ్ణి చేరదీస్తారు. మీ కాత్యాయని విషయంలో గణపతిశాస్త్రి తల దూర్చటం నాకు నచ్చలేదు."

"మరేం చేస్తాం చెప్పండి! ఎవరిమీదో ఒకరిమీద ఆధారపడాలి కదా?"

"ఆ అవసరం మీకు లేదు! కాత్యాయనికి మీరు పొడగట్లపల్లి సంబంధం తెచ్చారు కదా! దాంతో ఆ పిల్ల బెదిరిపోయింది. తన బాధను చెప్పుకుంటూ మా పాపకు ఉత్తరం రాసింది. వెంటనే అది అల్లుడిని తీసుకు చక్కా వచ్చింది" అన్నాడు కామరాజు.

శాస్త్రిగారు అతను చెప్పింది విచిత్రంగా వింటున్నాడు. 'ఎందుకు? ఏమిటి?' అని అడగకుండా కూర్చున్నారు.

"మా అల్లుడితో పాటే సూర్యం అని—మంచి కుర్రాడే—సాంప్రదాయకమైన కుటుంబం—బాంక్‌లో పని చేస్తున్నాడు. మీకు ఇష్టమయితే చూద్దాం" అన్నాడు కామరాజు.

"బావగారు ఏం చేస్తున్నారు?"

"రాజమండ్రిలో పౌరోహిత్యం చేసేవారు. ప్రస్తుతం ఖాళీ. కుర్రాడికి మంత్రాలూ రాకపోయినా మంచివాడే."

"ఎంతలో ఉన్నారు?"

"అదంతా నాకు వదిలెయ్యండి. మీరు ఊఁ అనండి చాలు. ఖర్చంతా నాదే. పెళ్ళి ఘనంగా చేద్దాం" అన్నాడు కామరాజు.

శాస్త్రిగారు రెండు చేతులూ జోడించారు. కామరాజుగారి ఆప్యాయతకు ఆయన కళ్ళు తడిశాయి.

"తమరి ఇష్టప్రకారమే కానివ్వండి."

తన మాటకు విలువ ఇచ్చినందుకు పొంగిపోయాడు కామరాజు.

ఒక్క నిముషం మౌనంగా ఉండి "మరో విషయం" అన్నాడు.

"చెప్పండి" అన్నారు శాస్త్రిగారు.

"వచ్చే కార్తీకంలో లక్షపత్రి పూజ కొంచెం ఘనంగా చేద్దామని..."

"ఇప్పటినుంచీ తొందర ఎందుకండీ?"

"అదే మీకు చెప్పబోయేది. ఈసారి మనవాడికి కేబినెట్లో స్థానం దొరికింది. మా బామ్మరిది జిల్లా పరిషత్ ఛైర్మన్‌షిప్‌కు ప్రయత్నం చేస్తున్నాడు. పరిషత్ ఎలక్షన్లలో మా వాడికి అనుకూల వాతావరణం సృష్టించాలి. అందుకు రెండు వర్గాలుగా చీలిపోయిన మావాళ్ళని లక్షపత్రి పూజ పేరుతో ఒకటి చెయ్యాలనుకుంటున్నాను. పెద్ద పెద్ద వాళ్ళని పూజకు పిలుస్తున్నాను. ఊరంతా పందిళ్ళు వేయిద్దాం. దేశమంతా కామరాజు పేరు

కాలం కథ

## దోపిడీ

—తెన్నేటి సుధ

"ఓహో! ఏమండీ పెళ్ళికూతురుగారూ, ఇటొచ్చారు?" సీత రాగానే పలకరింపుగా అంది రాధ.

"నీక్కూడా వెక్కిరింతగా ఉందే!

"అహా! అది కాదే—నా పెళ్ళి కోసం కావలసిన డబ్బుకు నాన్న నానా తంటాలూ పడుతుంటే నేను సంతోషంగా ఎట్లా ఉండగలను?" నిట్టూరుస్తూ సీత అంది.

"ఇది నీ ఒక్కదాని సమస్యే అయినట్లు బాధపడతావేం? ఎక్కడ ఆడపిల్ల ఉండునో—అక్కడ ఈ బాధలన్నీ ఉండును" అంది నవ్వుతూ, వాతావరణం తేలిక చేసే ప్రయత్నంలో రాధ.

"అయినా ఎవరివరకు వాళ్ళకి ఎదురైనప్పుడు బాధ తప్పదు కదే! అసలు నీ దగ్గరకు వచ్చిన పని విషయమే మరిచిపోయాను చూడు. మా నాన్న నా పెళ్ళి ఖర్చుల కోసమని మ్యారేజి లోన్, జి. పి. ఎఫ్. లోన్ల కోసం అప్లై చేశారు. ఆ లోన్ శాంక్షన్ చేయాలంటే ఆఫీసు ఉద్యోగస్తులే ఆఫీసరుగారికి 500 రూపాయలు లంచంగా ఇవ్వాలట..." అంది వివరంగా చెపుతూ సీత.

"ఎంత అన్యాయం!..."

"న్యాయమో, అన్యాయమో వారి స్థితి ఇది! మీ బాబాయిగారు హెడ్ ఆఫీసులో ఉన్నారు కదా! ఆయనేమన్నా సాయం చేయగలరేమో అని వచ్చానే నీ దగ్గరకు."

"తప్పకుండా అడుగుదాం" అంటూ రాధ సీతను తీసుకొని ఆఫీసుకు వెళ్ళింది. పరిచయాలయ్యాక విషయం వివరించింది రాధ.

"చూడమ్మా రాధా! సీత తండ్రి మా బ్రాంచి ఆఫీసులోనే పని చేస్తున్నారు.

కొంత ఇవ్వక తప్పదు..." అన్నాడు.

"అదేమిటి? అప్పు పద్ధతి ప్రకారం రావడానికి నువ్వు సాయం చేస్తావనుకుంటే నువ్విట్లా అనడం ఏం న్యాయం బాబాయ్?" రాధ చనువుగా, నిర్మొహమాటంగా అడిగింది.

"నేనేం చేయనమ్మా? లంచం తీసుకోవడమనే ఈ జాడ్యం చీడపురుగులా దాపురించి, సర్వసామాన్యమైపోయింది. అయినా తప్పదు. అది లేకపోతే పని జరగదు మరి! నావరకు నేను ఇంటికోసం లోన్ తీసుకున్నప్పుడు మా పై ఆఫీసరుకు ముడుపు చెల్లిస్తేగానీ ఫైలు మాట్లాడలేదు. ఈ కేసులో నే నూరికే సాయం చేశానన్నా ఎవరూ నమ్మరు.

ఓ వంద రూపాయలు ఇవ్వవలసిందేనమ్మా."

"ఈ అన్యాయాన్ని ప్రతిఘటించే వీల్లేదా బాబాయ్?" అంది రాధ బాధగా.

"లేదమ్మా! ఆ ప్రయత్నంలో నేను చాలాసార్లు దెబ్బ తిన్నాను. సీత పెళ్ళికి అడ్వాన్స్ పెళ్ళి ప్రెజెంటేషన్ ఇచ్చేస్తున్నా ననుకొని—ఆ డబ్బు నేనే సమర్పించుకుని లోన్ శాంక్షన్ చేయిస్తాను..."

బాబాయి మాటలకు చెప్పవలసిన సమాధానమేమిటో అర్థం కాక సీత, రాధ—ఇద్దరూ మెల్లగా ఆఫీసు నుంచి బయటికి నడిచారు. ★